ప్రజాశక్తి
మంగళవారం 7 జనవరి 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

కళ్ల ముందే కాలిపోయారు..

- ఓ ఇంటిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు
- సజీవదహనమైన అక్కాచెల్లెళ్లు
- కాపాడేందుకు ప్రయత్నించిన తల్లికి తీవ్రగాయాలు
- పర్చూరులో విషాదం

యువతులు సజీవ దహనమైన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-పర్చూరు

పెరాలసిస్‌తో కదల్లేని ఒక యువతి.. అనారోగ్యంతో బాధపడుతున్న మరో యువతి.. ఈ ఇద్దరు అక్కాచెల్లెళ్లు షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటల్లో చిక్కుకొని తల్లి కళ్ల ముందే ఆదివారం అర్ధరాత్రి సజీవ దహనమయ్యారు. కూతుళ్లను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించిన తల్లి కూడా తీవ్రంగా గాయపడింది. అక్కాచెల్లెళ్లు సజీవ దహనమవడంతో పర్చూరులో విషాదం

నాగమణి (ఫైల్)

మాధవీలత (ఫైల్)

నెలకొంది. ఈ ఘటన పర్చూరు, తూర్పుబజారు రామాలయం సమీపంలో సోమవారం వేకువజామున రెండు గంటల సమయంలో జరిగింది.

తూర్పు బజారులో నివాసం ఉండే దాసరి వెంకటేశ్వర్లు, లక్ష్మీ రాజ్యంకు ఇద్దరు కుమార్తెలు నాగమణి (34), మాధవీలత (30), కుమారుడు శ్రీనివాసరావు ఉన్నారు. నాగమణి పెరాలసిస్‌తో కొన్నేళ్లుగా మంచం పట్టునే ఉంటోంది. మాధవీలత ఫిట్స్‌తో బాధపడుతోంది. స్థానిక లారీ ఆఫీసులో ▶ 2లో

దిగజారుతున్న రబీ సాగు

- ఈ ఏడాది 55.97 శాతం విస్తీర్ణంలోనే పంటలు
- ప్రకృతి వైపరీత్యాలు.. ధరలు.. పెట్టుబడి సమస్యలే కారణం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జిల్లాలో వ్యవసాయరంగం తిరోగమనం వైపు నడుస్తోంది. కొత్త కొత్త మార్పులతో వ్యవసాయరంగం పరుగులెత్తకపోగా ఉన్న సాగు కూడా పడిపోతోంది. అందుకు కారణాలను పరిశీలిస్తే అనేక సవాళ్లు కనిపిస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలతో పాటు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో పాటు పెట్టుబడులు పెద్దసమస్యగా మారాయి. దీంతో వ్యవసాయాన్ని వదిలేసి ఇతర వ్యాపారాల వైపు మధ్యతరగతి రైతులు వెళుతున్నారు. ఫలితంగా ఇప్పటివరకూ వ్యవసాయ కూలీలుగా ఉన్న వాళ్లు కౌలు రైతులుగా ఆ భూములను తీసుకొని సాగు చేసుకుంటున్నారు. అయితే రైతులకు వ్యవసాయ రంగంపై శ్రద్ధ తగ్గడంతో సాగు కూడా తగ్గుతోంది. ఇది పంటలపై ప్రభావం చూపుతోంది.

ఈ ఏడాది జిల్లాలో రబీసాగు 55.97 శాతానికి పడిపోవడమే ఇందుకు తార్కాణం. జిల్లాలో రబీ పంటల సాధారణ విస్తీర్ణం 1,61,020 హెక్టార్లుకుగానూ ఈ ఏడాది 90.122 హెక్టార్లలో వివిధ పంటలు వేశారు. గతేడాది ఇదే సమయానికి 91,801 హెక్టార్లలో సాగు చేశారు. ఐదేళ్లలో సగటు విస్తీర్ణం 1.12.132 హెక్టార్లుగా తేలింది. అంటే ఏటికేడు తగ్గుతోంది. ఐదేళ్లలోనూ తగ్గుదల కనిపిస్తోంది. ఒక ఏడాది కరువు కాటకాలు వస్తే.. మరో ఏడాది అధికవర్షాలు సంభవించి పంటల సాగుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు వెంటాడుతున్నాయి. గతేడాది రబీ కరువుకు బలైంది. ఈ ఏడాదిలో మూడు సార్లు భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇక రబీలో ప్రధాన పంటగా ఉన్న వరి సాగు చూస్తే 47.68 శాతమే ఉంది. కారణం సాగర్ కాలువల నిర్వహణ సరిగా లేదు. రిజర్వాయర్లు నిండినా నీటి విడుదలపై నిర్ణయం తీసుకోలేకపోయారు. దీంతో రైతులు మాగాణికి బదులు ఇతర ఆరుతడి పంటలవైపు మొగ్గు చూపారు. మాగాణి తగ్గుతోంది. నీళ్ల లేక వరుసగా మూడేళ్ల పంటకు విరామం కూడా ప్రకటించారు. ఇలా మాగాణి సాగు పడిపోతోంది. ధాన్యం ధరలు పెరగడం లేదు. బియ్యం ధరలు పెరిగినంతగా ధాన్యం ధరల్లేవు. ఇక సాగర్ ఆయకట్టులో 70 వేల ఎకరాలకు పైగా నీరందక ఆరుతడికి మారిపోయింది. ఇంకా చెప్పాలంటే మాగాణి సాగు భూముల్లో నీళ్ల లేక సుబాబుల్ వంటి సామాజిక వనాలు సాగు చేస్తున్నారు. మరో వాణిజ్య పంట శనగ. జిల్లాలో 49,177 హెక్టార్లలో సాగవుతుంది. ధరల్లేక శనగ సాగు సజావుగా లేదు. ఈ ఏడాది 36.23 శాతానికి పడిపోయింది. సకాలంలో వర్షాలు కూడా దీనికి అవసరం. ఇంకా మిర్చి గణనీయంగా పండుతోంది. మిర్చి పంట రైతుల చేతికి రాగానే ధరలు పడిపోతాయి. పైగా ఇక్కడ మార్కెట్ సౌకర్యాలు లేవు. గుంటూరు మార్కెట్‌యార్డుకు తరలించి అమ్ముకోవాలి. అక్కడ దళారుల మోసాల వంటివి కొత్తేమీ కాదు. నియోజకవర్గానికొక మార్కెట్‌యార్డు ఉన్నా ఇక్కడ కొనుగోళ్లు ▶ 2లో

రావినూతలలో క్రికెట్ పోటీలకు గ్రౌండ్‌ను సిద్ధం చేస్తున్న దృశ్యం

రేపటి నుంచి క్రికెట్ పండుగ

▶ 8లో

'ఉపాధి' కూలీలకు

సరాసరి వేతనం పెంచేందుకు చర్యలు

▶ 8లో

23న వెలిగొండ జలాల సాధన సదస్సు

హాజరుకానున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

▶ 8లో

బాపట్ల జిల్లా ఓటర్లు

12,90,986 మంది..

- పురుష ఓటర్లు 6,29,411, మహిళా ఓటర్లు 6,61,495
- తుది ఓటర్ల జాబితా విడుదల చేసిన కలెక్టర్ వెంకటమురళి

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్యకు ఓటర్ల జాబితా అందజేస్తున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాకు సంబంధించి తుది ఓటర్ల జాబితాను కలెక్టర్ జె.వెంకటమురళి సోమవారం విడుదల చేశారు. ఆ జాబితా ప్రకారం 2025 జనవరి 6వ తేదీ నాటికి జిల్లాలో మొత్తం 12,90,986 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 6,29,411 మంది పురుష ఓటర్లు కాగా, 6,61,495 మంది ▶ 2లో

నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితా

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
వేమూరు	95,592	1,01,841	16	1,97,449
రేపల్లె	1,11,250	1,16,009	13	2,27,272
బాపట్ల	92,483	97,867	11	1,90,361
పర్చూరు	1,11,731	1,17,349	5	2,29,085
అద్దంకి	1,19,552	1,24,427	12	2,43,991
చీరాల	98,803	1,04,002	23	2,02,828
మొత్తం	**6,29,411**	**6,61,495**	**80**	**12,90,986**

ఎస్‌సి ఉపకులాల వారీగా

సమగ్ర వివరాలు అందించండి

అధికారులను కోరిన ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్‌రంజన్‌మిశ్రా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎస్‌సి ఉప కులాల వారీగా సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతులపై ఖచ్చితమైన గణాంకాలతో సమగ్ర వివరాలను అందించాలని ఏకసభ్య కమిషన్ ఛైర్మన్, విశ్రాంత ఐఎఎస్ అధికారి రాజీవ్‌రంజన్‌మిశ్రా, అధికారులను కోరారు. ప్రకాశం జిల్లా పర్యటలో భాగంగా ఎస్‌సి ఉపకులాల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా సోమవారం ఉదయం కలెక్టరేట్ లోని ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్) హాలులో అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాకు సంబంధించి ఎస్‌సి ఉప కులాల వారీగా జనాభా, వారి స్థితిగతులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా

మాట్లాడుతున్న ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్‌రంజన్‌మిశ్రా

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జిల్లాలోని షెడ్యూల్ కులాల ప్రజల గణాంకాలను ఏకసభ్య కమీషన్ ఛైర్మన్ కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పూర్వపు ప్రకాశం జిల్లాలో మొత్తం 56 మండలాలు ఉన్నాయని, అందులో ప్రస్తుత ప్రకాశం జిల్లాలో 38 మండలాలు, బాపట్ల జిల్లాలో 13 మండలాలు, నెల్లూరు జిల్లాలో 5 మండలాలు ఉన్నాయని వివరించారు. 2011 జనాభా గణన ఆధారంగా పూర్వపు ప్రకాశం జిల్లాలో జనాభా మొత్తం 33,97,448 కాగా, అందులో ఎస్‌సి జనాభా మొత్తం 7,87,861 ఉన్నారని తెలిపారు. అందులో పురుషులు 3,97,242, స్త్రీలు 3,90,619 ఉన్నారన్నారు. ఎస్సీ అక్షరాస్యత జనాభా మొత్తం 4,10,946 కాగా, అందులో పురుషులు 2,40,551, స్త్రీలు 1,70,395 ఉన్నారన్నారు. ఎస్‌సి అక్షరాస్యత శాతం మొత్తం 59.75 శాతం ▶ 2లో

8న ఉద్యోగులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-మద్దిపాడు

సంక్రాంతి సంబరాలలో భాగంగా ఈనెల 8వ తేదీన మద్దిపాడు ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ వి.జ్యోతి సోమవారం తెలిపారు. మండలంలోని 18 గ్రామ సచివాలయాలలో ఉన్న సిబ్బందికి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టగ్ ఆఫ్ వార్, కబడ్డీ, మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలు, లెమన్ అండ్ స్పూన్ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులందరూ ఈ సంబరాల్లో పాల్గొని జయప్రదం చేయాలని ఎంపిడిఓ సూచించారు.

దిగజారుతున్న రబీ సాగు

(మొదటిపేజీ తరువాయి)

జరగడం లేదు. ఏ పంటనూ కొనే పరిస్థితి లేదు. చివరికి సుబాబుల్ ఒప్పందం కూడా మార్కెట్‌శాఖ ద్వారా అమలు కావాల్సిఉండగా దాన్నీ తూట్లు పొడిచారు. ఇక సాగు నుంచి రైతులు సంఖ్య తగ్గడంతో కౌలు రైతులు పెరిగారు. జిల్లాలో గత పదేళ్లలో కౌలు రైతులు సంఖ్య చూస్తే లక్షన్నర వరకూ చేరింది. అయితే కౌలు రైతులకు ఎటువంటి భద్రత లేకుండా పోయింది. రైతులే నష్టాలపాలై వ్యవసాయం నుంచి తప్పుకుంటున్న తరుణంలో కౌలు రైతులకు అసలు దిక్కుమొక్కూ లేకుండా పోయింది. నష్టాలు చవిచూశారు. భూములను కౌలుకు తీసుకుని శనగ, పత్తి, మిర్చి వంటి సాగు చేపట్టారు. కౌలు ఎకరాకు పాతిక వేలకు చేరింది. పంట చేతికి రాని ఏడాది దివాళా తీశారు. ఇలా ఎక్కువ శాతం నష్టపోయారు. దీంతో కౌలు వ్యవసాయం కూడా దిగజారుతోంది. ఇలా వ్యవసాయం అన్ని వైపులా నష్టాలవైపే సాగుతోంది. ప్రభుత్వం నుంచి రైతులకు ప్రోత్సాహకం లేదు. ఏ పంట సాగు చేసినా ఎకరాకు పెట్టుబడి రూ.50 వేలకు పైనే ఉంది. మిర్చికి లక్షన్నర వరకూ ఉంది. పొగాకు పంటకూ ఇదే స్థాయిలో పెట్టాలి. ప్రభుత్వాలు రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి ఎంత ఇస్తున్నారో చెప్పాల్సిన అవసరం లేదు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రకటించిన రూ.20 వేలు ఇంతవరకూ అతీగతీ లేదు. ఖరీఫ్, రబీ రెండు సీజన్లు పోయాయి. ఎదురుచూపులే మిగిలాయి. సాయాలు ఇలా ఉంటే రైతులు ఎలా ఉంటారో చెప్పొచ్చు. పడిపోతున్న సాగుపై ఇప్పటికైనా దృష్టి సారించకపోతే ఆహారభద్రతకే ముప్పు రానుంది.

బాపట్ల జిల్లా ఓటర్లు

12,90,986 మంది..

(మొదటిపేజీ తరువాయి)

మహిళా ఓటర్లు ఉన్నారు. 80 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. నూతన ఓటర్ల జాబితా తయారీలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాను గత ఏడాది అక్టోబర్ 29వ తేదీన ఏపీ ఎన్నికల సంఘం ప్రకటించింది. ముసాయిదా జాబితాపై గత నవంబర్ 28 వరకు అభ్యంతరాలను స్వీకరించారు. ఈ ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్ల నిండే వారి నుంచి కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తులు స్వీకరించారు. తుదిగా ఓటర్ల జాబితాను విడుదల చేశారు.

డిఎంహెచ్‌ఒను కలిసిన రిమ్స్ అధికారులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ టి.వెంకటేశ్వర్లును ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ఏడుకొండలరావు, ఒంగోలు సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జమున మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక జిజిహెచ్ సూపరింటెండెంట్ చాంబర్‌లో సోమవారం డిఎంహెచ్‌ఒను కలిసిన వారు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాను వైద్య ఆరోగ్య రంగంలో ప్రథమ స్థానంలో నిలపటానికి, పేద, బడుగు బలహీన వర్గాలకు సకాలంలో వైద్యసేవలు అందించటానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. జిజిహెచ్ సూపరింటెండెంట్, ఒంగోలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిఎంహెచ్ఒకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచేందుకు చర్యలు చేపడతామన్నారు.

డిఎంహెచ్‌ఓను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండల శాఖ, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్‌టియు ఆధ్వర్యంలో రూపొందించబడిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను ముప్పవరం జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం ఆర్.శ్రీదేవి ఆవిష్కరించారు. అనంతరం ఉపాధ్యాయులు చేతుల మీదుగా పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌టియు జిల్లా కార్యదర్శి గవిని శివశంకర్ మాట్లాడుతూ తమ సంఘం ద్వారా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించటంతో పాటు విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పడేలా తమ సంఘం కృషి చేస్తుందని తెలిపారు. అదేవిధంగా పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత శాతం సాధించడానికి ఈ స్టడీ మెటీరియల్ ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు కొండపి మండల అధ్యక్షులు పి.శ్రీనివాస్ మూర్తి, ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. ముప్పవరం పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసినందుకు పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

ఎస్‌సి కుల గణనలో పొరపాట్లను సరిచేయాలి

ప్రజాశక్తి- సంతమాగులూరు

కులగణన సర్వేలో ఎస్‌సి మాదిగ అని మాత్రమే నమోదు చేసి జాతీయత కాలాన్ని ఖాళీగా వదిలి వేసినట్లు పాత మాగులూరు ఎస్‌సి కాలనీ వాసులు వాపోయారు. ఎస్‌సి గణన పరిశీలకు వచ్చిన సోషల్ వెల్ఫేర్ ఎఎస్‌డబ్ల్యుయు స్వరూపకు గ్రామ సర్పంచి జిర్రా విజయబాబు ఆధ్వర్యంలో వినతి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ఎస్‌సి కాలనీలో 400 కుటుంబాల నివసిస్తున్నట్లు వారు తెలిపారు. సోషల్ వెల్ఫేర్ ఎఎస్‌డబ్ల్యుయు స్వరూప మాట్లాడుతూ గ్రామ సచివాలయంలో కులగణనకు సంబంధించి జాబితా ప్రచురితమైనట్లు తెలిపారు. కులగణనలో ఏమైన తేడాలు ఉంటే సరి చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ మిరియాల శేషుబాబు, విఆర్ఒ రాధిక, ఎస్‌సి హాస్టల్ వార్డెన్ మున్నంగి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర వివరాలు అందించండి

(మొదటిపేజీ తరువాయి)

కాగా అందులో పురుషులు శాతం 69.50 శాతం, స్త్రీలు 49.86 శాతంగా ఉందని కలెక్టర్ వివరించారు. ఏకసభ్య కమిషన్ పర్యటనను పురస్కరించుకుని జిల్లా అధికారులు నుండి సేకరించిన సమాచారం ప్రకారం ఉద్యోగులలో ఎస్‌సిల లోని అన్ని ఉప కులాలు కలిపి మొత్తం 36,669 మంది ఉన్నారని, అందులో మాల కులంలో 21,739, మాదిగ కులంలో 14,770, ఇతర ఉప కులాలు 160 మంది ఉన్నారని తెలిపారు. రాజకీయంగా మున్సిపాలిటీలలో మాల కులంలో 23 మంది, మాదిగ కులంలో 13 మంది వివిధ పదవులలో ఉన్నారని, పంచాయతీలలో మాల కులంలో 1,386 మంది, మాదిగ కులంలో 1,867 మంది, ఇతర ఉప కులాల్లో ఐదుగురు వివిధ పదవులలో ఉన్నారని కమిషన్ ఛైర్మన్‌కు కలెక్టర్ వివరించారు. అనంతరం ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు, కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి ఉపకులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులపై అధ్యయనానికి కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. జిల్లాల స్థాయిలో ఎస్‌సిలలోని 59 ఉపకులాల పరిస్థితులపై అధ్యయనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు వారి వారి శాఖలలో పనిచేస్తున్న ఎస్‌సి ఉద్యోగుల వివరాలను, క్యాడర్, ఉపకులాల వారీగా ఖచ్చితమైన గణాంకాలతో కూడిన సమాచారం తమకు సమర్పించాలని కోరారు. స్థానిక సంస్థలలో ఎస్‌సిల ప్రజాప్రాతినిధ్యంపై ఉపకులాల వారీగా సమాచారం అందజేయాలని అధికారులను కోరారు. విద్య, ఉపాధి రంగాలలో ఉపకులాల వారీ సమాచారాన్ని డిఈఓ, డిఆర్‌డిఎ, మున్సిపాలిటీ, పరిశ్రమలు, హౌసింగ్ వంటి శాఖల అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్, సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, మార్కాపురం సబ్‌కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, జిల్లా రెవెన్యూ అధికారి బి.చినఓబులేసు, ఒంగోలు, కనిగిరి ఆర్‌డిఓలు కె.లక్ష్మీప్రసన్న, కేశవర్ధన్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిడి ఎస్.లక్ష్మా నాయక్, ఎస్సి కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
OS No : 664/2019
వెలుతుర్ల శ్రీనివాసులు ... వాది
వర్సెస్
తాటి లక్ష్మీ వరప్రసాదు ...ప్రతివాది
నోటీసు
To
తాటి లక్ష్మీ వరప్రసాదు
పై నెంబర్ దావాలో నీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించిననూ నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున కోర్టు వారు నీ నోటీసు నిమిత్తమై తేదీ : 10-01-2025 నా వాయిదా వేసి ఉన్నారు. ఆ రోజున ఉదయం గం 10:30కి నీవు పై కోర్టులో హాజరు కావలసియున్నది. లేనిచో నీపరోక్షమున కేసు తీర్మానించబడునని తెలియజేయడమైనది
ఇట్లు
వై.సాయిబాబు
అడ్వకేట్, ఒంగోలు
సెల్ : 9849604168

పత్రికా ప్రకటన
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా మా క్లయింట్ అయిన ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం కొప్పోలు గ్రామ కాపురస్తులు అయిన జమ్ము రత్తయ్య S/o లేటు కొండయ్య అనువారు ఒంగోలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో IA No : 351/2023, OS No : 549/2023 పర్మినెంట్ ఇంజక్షన్ కొరకు దావా దాఖలు చేసియున్నారు దావా పైకోర్టులో పెండింగ్ లో ఉన్నది. మా క్లయింట్ తెలిసిన సమాచారంతో ప్రతివాదులైన తోట నారాయణ స్వామి K.మోహన్ రాజు అను వారలు పై దావా లో 4వ ప్రతివాది 5వ ప్రతివాది, గా ఉన్నారు. వీరు ఇరువురు క్రింది షెడ్యూలు ఆస్తిని ఇతరులకు అమ్ము జూపినారు అని తెలియ వచ్చినది.ఏవైనా అగ్రిమెంట్లు గాని రిజిస్ట్రేషన్ లు గాని దావా పెండింగ్ లో ఉండగా పై ఇరువురు చేసినట్లు అయితే అవి మా క్లయింట్ కు ఏటువంటి సంబంధం లేదు. ఒకవేళ రిజిస్ట్రేషన్ చేసిన యెడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియ జేయడమైనది.
షెడ్యూలు
ప్రకాశం జిల్లా రిజిస్ట్రార్ ఒంగోలు సబ్ రిజిస్ట్రీ ఒంగోలు రెవెన్యూ & మండలం కొప్పోలు గ్రామం సర్వేనెంబర్ 620లో య. 0.64 సెంట్ల వ్యవసాయ భూమికి హద్దులు.
తూర్పు : వ్యవసాయ భూమి K. రామయ్య
దక్షిణం : ఎస్ స్వర్ణకుమారి
పడమర : ఎం రంగమ్మ
ఉత్తరం : జె జయలక్ష్మి
ఇట్లు
అలవలపాటి బ్రహ్మయ్య
అడ్వకేట్, ఒంగోలు
సెల్ : 986849125

కళ్ల ముందే కాలిపోయారు..

(మొదటిపేజీ తరువాయి)

వాచ్‌మెన్ గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు ఆదివారం రాత్రి కూడా ఎప్పటిలాగే డ్యూటీకి వెళ్లాడు. కుమారుడు శ్రీనివాసరావు లారీ క్లీనర్‌గా వెళ్లి ఉన్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో తల్లి లక్ష్మీరాజ్యం, కూతుళ్లు నాగమణి, మాధవీలత నివసిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఇంట్లో అగ్నిప్రమాదం సంభవించింది. మంటలను గమనించిన తల్లి పెద్దగా కేకలు వేసింది. కూతుళ్లను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించి గాయాలపాలైంది. చుట్టుపక్కల వాళ్లు ఇచ్చిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి వచ్చారు. అప్పటికే నాగమణి సజీవదహనం కాగా.. మాధవీలత మంటలు, పొగ కారణంగా ఊపిరాడక మృతిచెందింది. చీరాల అగ్నిమాపక సిబ్బంది ఇంటిలో ఉన్న గ్యాస్ సిలిండర్‌ను పేలకుండా బయటికి తెచ్చి, మంటలను అదుపు చేశారు. మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్ర గాయాలపాలైన తల్లి లక్ష్మీరాజ్యంను మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్లూస్ టీం ఎస్సై కె.వెంకటేష్ సంఘటన స్థలంలో కాలిపోయిన విద్యుత్ తీగ ముక్కలను పరిశీలనకు పంపారు. ఈ సందర్భంగా డీఎస్పీ రామాంజనేయులు మాట్లాడుతూ అగ్నిప్రమాదంపై దర్యాప్తు చేపట్టామన్నారు. ఘటన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా లేక దోమల కాయిల్స్ వల్ల జరిగిందా లేక మరేదైనా కారణాలు ఉన్నాయా.? అనే విషయమై విచారణ చేస్తున్నామన్నారు.

అగ్ని ప్రమాద ఘటనపై ఎమ్మెల్యే ఏలూరి దిగ్భ్రాంతి

పర్చూరులో సోమవారం జరిగిన అగ్నిప్రమాదం పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ అగ్ని ప్రమాదంలో దాసరి వెంకటేశ్వర్లు కుమార్తెలు నాగమణి, మాధవీలత మతి చెందడం చాలా బాధాకర మన్నారు. ఈ ఘటన తనను కలచివేసిందన్నారు. చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లు సతీమణి లక్ష్మీరాజ్యం త్వరగా కోలుకోవాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఆ కుటుంబానికి అండగా ఉంటానని చెప్పారు.

ఆర్థిక సాయం అందజేత

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఏలూరి తరపున టిడిపి నాయకులు రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పర్చూరు తహశీల్దార్ బ్రహ్మయ్య, డిటి సుధారాణి, తెలుగుదేశం నాయకులు మల్లాది నరేంద్రబాబు, కొండ్రగుంటి శివనాగేశ్వరరావు, ఎస్.కె.గౌస్, ఎం.వెంకటశివసురేష్, దాసరి సుధాకర్ పాల్గొన్నారు.

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచీలు : Opp.చుండూరి పెట్రోల్ బంక్, ఆద్దంకి బస్టాండ్, ఒంగోలు. - బంగ్లారోడ్డు, భాష్యం స్కూల్ దగ్గర, అద్దంకి-523201 - #6/97&98, వార్డు నెం.6, ఎల్ఐసీ ఆఫీసు, నాయుడు వీధి, దొర్నాల జంక్షన్ వద్ద, మార్కాపురం. ఫోన్ : 9492934845 - D.no:2-14-26, Near Chatrapati Sivaji Statue, Devi Theater Road, Kavali -524201, PH No: 9573111796 -S. V. Gopal Reddy complex, YSR Road, Kanigiri – 523230.
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 26-01-2025 ఉ. 10-00 గంటలకు మా బ్రాంచ్ ఆఫీసు నందు 1155.55 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు D.No:37-1-175(2), Opp: CHUNDURI PETROL BUNK, Aadanki Bus Stand, Ongole, AP-523001 నందు వేలం వేయ బడుచున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన వడ్డీ చెల్లించకుండా పలుమార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ విడిపించు కోకుండా వదిలివేసిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిస్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగినది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ ఐడెంటిటీ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంట తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయము ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
అడ్రెస్ ఆఫీస్
KANAKADURGA FINANCE LIMITED
D.No:37-1-175(2), Opp: CHUNDURI PETROL BUNK, Aadanki Bus Stand, Ongole, AP- 523001 CONTACT PERSON, AREA MANAGER, SIVA PRASAD-87124 44616

కారు ఢీకొని మహిళ మృతి

రోడ్డుపై గ్రామస్తుల రాస్తారోకో

కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

గంగమ్మ (ఫైల్)

565 జాతీయ రహదారిలో కారు అదుపు తప్పి మహిళను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సోమవారం కొనకనమిట్ల మండలంలోని ఎదురాళ్లపాడు గ్రామంలో జరిగింది. అందిన వివరాల మేరకు.. మండలంలోని ఎదురాళ్ళపాడు గ్రామానికి చెందిన నాగం గంగమ్మ (43) తన పొలంలో సాగు చేసిన మిరప పంటలో సేద్యం చేస్తున్న రైతుకు ఇంటికెళ్లి అన్నం తీసుకొని వస్తానని చెప్పి వస్తుండగా మార్కాపురం నుంచి కనిగిరి వైపు వెళ్తున్న కారు డ్రైవర్ నిద్రమత్తు కారణంగా అదుపు తప్పి గంగమ్మను బలంగా ఢీకొట్టింది. కొంత దూరం పొలాలలోకి కారు దూసుకు పోయింది. కారులో ఉన్నవారు ప్రాణాపాయం నుంచి బయటపడి ఊపిరి పీల్చుకున్నారు. మృతురాలు గంగమ్మకు భర్త చిన్నకొండయ్య, ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. గ్రామస్థులు రోడ్డుపై ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న తర్లుపాడు ఇన్‌చార్జి ఎస్ఐ బత్తుల బ్రహ్మనాయుడు పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు, కుటుంబ సభ్యులతో మాట్లాడి సర్దిచెప్పి ఆమె మృతదేహాన్ని అక్కడ నుంచి తరలించారు. గొల్లమారి తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచులు కుర్ర పోలయ్య, మండల మాజీ ఎస్సీసెల్ నాయకులు పందిటి ఏసేబు, టిడిపి మాజీ కన్వీనర్ తాతిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, పి.జాన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మృతదేహం వద్ద గుమిగూడిన గ్రామస్తులు

పొలాల్లోకి దూసుకుపోయిన కారును పరిశీలిస్తున్న ఎస్ఐ

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-రేపల్లె

రాజేంద్ర మృతదేహం

మనస్తాపంతో వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రేపల్లె పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇసుకపల్లికి చెందిన నంద్యాల రాజేంద్ర (40) గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురై ఫ్యాన్‌కి ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుని భార్య శివ నాగ విజయ లక్ష్మి గుర్తించి చుట్టు ప్రక్కల వారి సహాయంతో రేపల్లె ప్రభుత్వ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య శివ నాగ విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో హెల్పర్‌కు గాయాలు

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

షాక్‌కు గురైన దేవరాజ్

విద్యుత్ స్తంభంపై బల్బులు మారుస్తుండగా విద్యుదాఘాతానికి గురైన హెల్పర్ గాయపడిన సంఘటన గిద్దలూరు మండలంలోని కొమ్మనూరు గ్రామంలో సోమవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. అంబవరం గ్రామానికి చెందిన దేవరాజ్ కొమ్మునూరు గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న విద్యుత్ లైన్‌మెన్‌కు హెల్పర్‌గా రోజువారీ కూలీకి పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ బల్బు మార్చే పనిలో దగ్గరలో ఉన్న విద్యుత్ ప్రసార తీగ తగిలి ఈ ప్రమాదం జరిగినట్లు గ్రామస్తుల సమాచారం. క్షతగాత్రుడిని గిద్దలూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యుల సలహా మేరకు అత్యవసర చికిత్స నిమిత్తం కర్నూలు వైద్యశాలకు తరలించారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలంలోని చిన్నవెంకన్న పాలెం గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో సామాజిక తనిఖీ బృందం అధికారులు గ్రామ సభను సోమవారం నాడు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందం అధికారులు మాట్లాడుతూ చినవెంకన్నపాలెం గ్రామంలో ఉపాధి హామీ పనులలో భాగంగా 17 పనులకు గాను రూ.29,92,827 బిల్లు అయిందని గ్రామస్థులకు వివరించారు. ఈ పనులు ఎక్కడెక్కడ జరిగాయో వివరించి జరిగిన పనులకు మస్టర్లకు రూ.14వేలు తేడా ఉందని గుర్తించడం జరిగిందని ఎస్‌ఆర్‌పి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీ యం.రమేష్, సర్పంచి, పంచాయతీ కార్యదర్శి, వేతనదారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-కొత్తపట్నం

భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహశీల్దార్ మధుసూదన్‌రావు తెలిపారు. కొత్తపట్నం మండలంలోని పాదర్తి గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సమస్యలతో కూడిన 88 అర్జీలను ఇవ్వటం జరిగింది. ఇందులో ప్రధానంగా ఆన్‌లైన్ సబ్ డివిజన్‌కు 38, కుల, ఆదాయ సర్టిఫికెట్‌ల కోసం 16, ఎఫ్‌లైన్‌కు 26, రెడ్రస్‌కు 18, అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ మధుసూదన్‌రావు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే 16 అర్జీలను పరిష్కరించామన్నారు. భూ సమస్యల పరిష్కారానికి గ్రామ రెవెన్యూ సదస్సులు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. రెవెన్యూ సదస్సులు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, ఆర్ఐ, రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-శింగరాయకొండ

సమాజంలో వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల కన్వీనర్ సన్నెబోయిన నాగేశ్వరరావు అన్నారు. సోమవారం నాడు వికలాంగుల సమస్యలపై మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులు సమాజంలో పడుతున్న ఇబ్బందులు గుర్తించి ప్రభుత్వం, అధికారులు చొరవతీసుకొని సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని ఈ సందర్భంగా కోరారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి సమావేశాలకు సహకరించిన గంజి సుబ్బారావు, ఆర్ఎంపీ వైద్యులు సుబ్బారావు, పసుపులేటి శేషారావులకు కమిటీ సభ్యులు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆరేటి వేణు తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రూపుల మధ్య ఘర్షణ

ఐదుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-బేస్తవారిపేట

గాయపడిన ఎర్రమౌలాలి, సద్దాం హుస్సేన్

రహదారిపై వాహనాలు నిలిపే విషయమై ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఐదుగురు గాయపడిన సంఘటన బేస్తవారిపేటలో జరిగింది. బేస్తవారిపేట పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బేస్తవారిపేట జగన్నాయకుల వీధిలో రోడ్డుకు అడ్డంగా ద్విచక్ర వాహనాలు నిలుపుతున్నారన్న విషయమై దూదేకుల ఎర్ర మౌలాలి, దూదేకులు ఖలీల్ గొడవ పడ్డారు. ఈ ఘర్షణలో ఖలీల్, ఎర్రమౌలాలి వర్గాలు ఒకరిపై మరొకరు దాడికి పాల్పడ్డారు. ఈ ఘర్షణలో ఎర్రమౌలాలి, ఖలీల్, సద్దాం హుస్సేన్, బాతులమ్మ, మౌలాబీలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్సలు చేశారు. మెరుగైన వైద్య చికిత్స కోసం ఎర్ర మౌలాలిని మార్కాపురం ప్రభుత్వ వైశాలకు తరలించినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘర్షణపై బేస్తవారిపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - చీరాల

సభ్యత్వ నమోదులో నాయకులు

చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి వారికి 200 యూనిట్లు ఉచిత కరెంటు ఇవ్వాలని చేనేతసంఘం నాయకులు కోరారు. మండల పరిధిలోని ఈపురపాలెంలో చేనేత సభ్వత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. చేనేత కార్మికులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చేనేత రంగంపై జిఎస్‌టినిజ రద్దు చేస్తామని చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు నిలబెట్టు కోవాలన్నారు. చేనేత వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, చేనేత కార్మికులకు బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గద్దె హేమసుందర్‌రావు, మురుగుడు సత్యనారాయణ, చేతివత్తుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పి.కొండయ్య, చేనేత జిల్లా నాయకులు దీపాల సత్యనారాయణ, ఎర్రవ రాధ తదితరులు పాల్గొన్నారు.

కూలీల ఆటో బోల్తా

ఏడుగురికి గాయాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

చికిత్స పొందుతున్న అంజమ్మ

బతుకుదెరువు కోసం వారంతా పొగాకు కోత కూలీలుగా మారారు. రోజుటిలాగే సోమవారం కూడా ఆటోలో యర్రగొండపాలెం నుంచి పుల్లలచెరువు మండలంలోని చెన్నంపల్లి గ్రామంలోని పొగాకు తోటల్లో కోత కూలి పనికి బయలుదేరారు. పుల్లలచెరువు రోడ్డులోని పెట్రోల్ బంకు సమీపంలో గల మూలమలుపులో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న కోత కూలీలైన సొంటిరెడ్డి పార్వతమ్మ, టి నాగమణి, గుర్రం మల్లేశ్వరి, భూలక్ష్మి, అంజమ్మ, శ్రీలక్ష్మి, కోటేశ్వరిలకు గాయాలయ్యాయి. వీరిని యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చేర్పించి చికిత్సలు అందించారు. కాగా వీరిలో సొంటిరెడ్డి పార్వతమ్మకు తీవ్ర గాయాలు కావడంతో ఆమెను మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం పల్నాడు జిల్లా నరసరావుపేటకు తరలించారు.

పింఛన్లు వెరిఫికేషన్

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలంలో అనర్హత కలిగిన పెన్షన్ల ఏరివేతలో భాగంగా కొండపిలో సోమవారం పెన్షన్‌దారుల వెరిఫి కేషన్ కార్యక్రమం నిర్వహించారు. లబ్దిదారులు ఇంటికి నేరుగా వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి గమనించి అర్హులో కాదో నిర్ధారిస్తున్నారు. ఈ సందర్భంగా దర్శి సిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కె.ఆంజనేయులు మాట్లాడుతూ కొండపి మండలంలో రూ.15 వేలు పింఛను తీసుకుంటున్న వారు 74 మంది ఉండగా, వారిలో సోమవారం నాడు 21 మంది వెరిపికేషన్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.రామాంజనేయులు, ఒంగోలు రిమ్స్ వైద్యశాల అధికారులు జి.హలీల, పెట్లూరు పిహెచ్‌సి వైద్యులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను నిర్మూలించాలి

ప్రజాశక్తి-టంగుటూరు

గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా నిర్మాలించాలని జరుగుమల్లి ఎంపీడీవో ఎంవీ రమణమూర్తి అన్నారు. డ్రాప్ అవుట్స్ లేకుండా ప్రతి ఒక్క బాల, బాలికలు పనికి పోకుండా పాఠశాలకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ సిబ్బందిని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రానికి రాని బాల, బాలికలను గుర్తించాలన్నారు. కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉండేలా వారికి నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో డోలా శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ ఏడుకొండలు, గృహనిర్మాణ శాఖ ఏఈ సీతారాం సింగ్, ఐసిడియస్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు

రెవెన్యూ సదస్సుకు 17 అర్జీలు

ప్రజాశక్తి నాగులుప్పలపాడు

భూసమస్యలు పరిష్కారానికి సోమవారం మండలంలోని రాపర్లలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 17అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. అర్జీలను తక్షణమే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ వాసుదేవరావు, విఆర్‌ఓలు ప్రవీణ్ కుమార్, సుబ్బరామయ్య, కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అనగాని శివప్రసాద్

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నగరం

ప్రజాశక్తి 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్, స్థానిక టిడిపి నాయకులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనగాని శివప్రసాద్ మాట్లాడుతూ ప్రజాశక్తి మహిళలకు ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేకంగా క్యాలెండర్‌ను రూపొందించడం సంతోషకరంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పూడివాడ మాజీ సర్పంచి కాసాని శ్రీనివాసరావు (కెఎస్ఎం) పాల్గొన్నారు.

9న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి- ఇంకొల్లు

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నరసరావుపేట మ్యాక్సీవిజన్ కంటి ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ రామలింగారెడ్డి సహకారంతో ఈనెల 9న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి కరి కమలేశ్వరరావు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ(ఆరోగ్య శ్రీ)కార్డు, హెల్త్ కార్డు ఉన్నవారికి కంటి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ వైద్యశిబిరాన్ని ఉద్యోగులు, విశాంత్ర ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలను 9133667555 , 7013535992 సెల్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

మోడల్ టెస్టు పేపర్లు అందజేస్తున్న రోటరీ నాయకులు

మోడల్ టెస్టు పేపర్లు అందజేత

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకిలోని ఎపి గిరిజన గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ వారి ఆధ్వర్యంలో రోటరీ ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు సౌజన్యంతో మోడల్ టెస్టు పేపర్లు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, ఎజి షేక్ మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, తాళ్లూరి బాబూరావు, ప్రిన్సిపల్ పురుషోత్తం, ఉపాధ్యాయులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యుపిసిలో పరిశీలన

ప్రజాశక్తి - పంగులూరు

చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాన్ని గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరులుగా మార్చుకోవాలని ఎంపిడిఒ కె.స్వరూప రాణి తెలిపారు. పంగులూరులోని ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాన్ని ఎంపిడిఒ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ గ్రామాల్లోని గార్బేజ్‌ను సేకరించి ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రానికి తరలించారు. అక్కడ తడి, పొడి చెత్తను వేరుచేసి వర్మీకంపోస్టు ఎరువును తయారు చేయాలని కోరారు. ఆ ఎరువును విక్రయించి పంచాయతీకి ఆదాయం వచ్చేలా చూడాలని గ్రామపంచాయతీ కార్యదర్శి గ్రీన్ అంబాసిడర్లకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి కె.సుమంత్, పంచాయతీ కార్యదర్శి బి .రాంబాబు, నాయకుడు గుడిపూడి రామారావు, పంచాయతీ గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రికెట్ 'పండుగ'

- వివిధ రాష్ట్రాల నుంచి 15 జట్లు రాక
- ఎనిమిది రోజులపాటు రావినూతలలో అభిమానులకు సందడి

ప్రజాశక్తి-మేదరమెట్ల

క్రికెట్ అభిమానులు పండుగ చేసుకునే సమయం ఆసన్నమైంది .వివిధ రాష్ట్రాల నుంచి క్రికెట్ క్రీడాకారులు తమ ఆటతో ప్రేక్షకులను ఆనందింపజేసే సమయం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. బాపట్ల జిల్లా కోరిశపాడు మండలం రావినూతల గ్రామంలో రావినూతల స్పోర్ట్స్ కల్చర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో శ్రీ భ్రమరా టౌన్ షిప్ వారి సహకారంతో 31వ సంక్రాంతి క్రికెట్ కప్ పోటీలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు .ఈనెల 8 నుంచి 15 నుంచి వరకూ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు. రావినూతల గ్రామ ప్రముఖులు, దేశ విదేశాలలో నివసిస్తూ ఉన్నత స్థాయిలోఉన్న వారి సహాయ సహకారాలతో ఈ గ్రామాన్ని క్రీడలను మరియు సాంస్కృతిక రంగాలలో అభివద్ధి చేయాలి అనే లక్ష్యంతో 1991లో రావినూతల స్పోర్ట్స్ కల్చర్ అసోసియేషన్ ఆవిర్భవించింది. అప్పటి నుంచి అనేక వడిదలుకులకు తట్టుకొని ఎంతోమంది రాజకీయ నాయకులు, అధికారులు ఉన్నత భావాలు కలిగినటువంటి వారి ఆర్థిక సహాయ సహకారాలతో నేడు అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలో నిర్వహించుకునే స్థాయికి ఈ స్టేడియం ఎదిగింది. ఈ పోటీలు టి20 ఫార్మెట్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నారు. ఈ పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, చెన్నై రాష్ట్రాల నుంచి 15 జట్లు పాల్గొంటున్నాయి. గత 31 సంవత్స రాలుగా సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సంక్రాంతి క్రికెట్ కప్ పేరుతో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతిగా 2 లక్షల , తతీయ బహుమతిగా లక్ష రూపాయల నగదు, షీల్డ్‌లు ఇవ్వనున్నారు. ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ ,బెస్ట్ బౌలర్ ,బెస్ట్ బ్యాట్స్మెన్ ,బెస్ట్ ఫీల్డర్ ,ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ లకు ప్రత్యేక బహుమతులు ఇవ్వనున్నారు. ఈ బహుమతులు కీర్తిశేషులు పుట్టా వెంకటరావు గారి జ్ఞాపకార్థం ఇవ్వనున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. సంక్రాంతి క్రికెట్ కప్పు పోటీల ప్రారంభోత్సవానికి బాపట్ల పార్లమెంట్ సభ్యులు తేనేటి కష్ణ ప్రసాద్, మా మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎర్రం రఘుబాబు, పర్యాటక అభివద్ధి సంస్థ చైర్మన్ నుకసాని బాలాజీ, రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ ,భ్రమరా టౌన్‌చిప్ మేనేజింగ్ డైరెక్టర్ గళ్ళ రామచంద్రరావు ,భారత బ్యాడ్మింటన్ సమాఖ్య మాజీ కార్యదర్శి కరణం చెంచు పున్నయ్య చౌదరి ,డాక్టర్ బి. జోహార్ పాల్గొనున్నట్లు రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చర్ అసోసియేషన్ అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు తెలిపారు.

రావినూతలతో క్రికెట్ పోటీలకు సిద్ధం చేసి గ్రౌండ్

క్రికెట్ స్టేడియంలోని భవనం

ఖోఖో పోటీల లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి - పంగులూరు

ఢిల్లీలో ఈనెల 13 నుంచి 19 వరకూ నిర్వహిస్తున్న ప్రపంచస్థాయి ఖోఖో పోటీల్లో భారత్ జట్టు విజయం సాధించాలని అద్దంకి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్రఖోఖో అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ బాచిన చెంచుగరటయ్య ఆకాక్షించారు. స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి మరియు బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో ప్రపంచస్థాయి ఖోఖోపోటీలకు సంబంధించిన లోగోను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గరటయ్య మాట్లాడుతూ మారుమూల గ్రామమైన పంగులూరులో ఖోఖో ఆటను ప్రారంభించి దేశవ్యాప్తంగా గుర్తింపు ఈ ప్రాంతానికి విధంగా కృషి చేసినట్లు తెలిపారు. పంగులూరులో ప్రపంచ స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించటానికి కూడా వెనకాడమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖోఖో రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారాం రెడ్డి, కోచ్ డి. లక్ష్మీనారాయణ రెడ్డి, పంగులూరు హైస్కూలు ప్రధానోపాధ్యాయులు కొప్పోలు రమాదేవి, నాగాలాండ్ విశ్రాంత ప్రొఫెసర్ బత్తుల వీరనారాయణ, రోటరీ క్లబ్ పంగులూరు క్యాంప్ చైర్మన్ చిలుకూరి వీరరాఘవయ్య, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు జాగర్లమూడి సుబ్బారావు, ఇమ్మడిశెట్టి సుబ్బారావు, గుడిపూడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయి ఖోఖో పోటీల లోగోను ఆవిష్కరిస్తున్న ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ బాచిన చెంచు గరటయ్య.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

రైతు సంఘం జిల్లా నాయకుడు కందిమళ్ళ రామకోటేశ్వరరావు

ప్రజాశక్తి-మార్టూరు

కోలలపూడి గ్రామ రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలనికౌలు రైతు సంఘం జిల్లా నాయకుడు కందిమళ్ళ రామకోటేశ్వరరావు కోరారు. మండల పరిధిలోని కోలలపూడి గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దారు ప్రశాంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామ కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ సర్వేనెంబర్ 208లో 20 సెంట్లు భూమి స్థానిక శివాలయానికి చెందినది తెలిపారు. ఆ నంబర్‌తో పాటు చుట్టు ప్రక్కల నంబర్లలోని ప్రైవేట్ భూములు కూడా దేవాదాయ శాఖకు చెందినవిగా రికార్డుల్లో నమోదైనట్లు తెలిపారు. దీంతో రైతులు తమ భూముల క్రయ, విక్రయాలు జరుపుకోవాలన్నా, ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నా సమస్యగా మారినట్లు తెలిపారు. దేవాలయానికి చెందిన 20 సెంట్లు భూమిని ఆ సర్వే నంబరు 208 నుంచి విడగొట్టి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. గ్రామకంఠం భూమిని సైతం ప్రభుత్వ భూమిగా రికార్డులలో చూపుతున్నందున రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించాలని రామకోటేశ్వరరావు కోరారు. ఈ కార్యరకకమంలో గ్రామ సర్పంచి సతీష్ కుమార్, స్థానసిక నాయకులు, దేవాదాయ శాఖ ఇఒ శిరీష, సర్వేర్ ఏడుకొండలు విఆర్ఒ వీరయ్య, కృష్ణ, శంకర్ పాల్గొన్నారు

తహశీల్దారుతో మాట్లాడుతున్న కందిమళ్ల రామకోటేశ్వరరావు

'పల్లె పండుగ' పనులు పూర్తి చేయాలి

పంచాయతీ రాజ్ ఇఇ కోటేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పల్లెపండుగ పథకం క్రింద చేపట్టిన పనులు సంక్రాంతి లోపు పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (పిఆర్ఐ) వై.కోటేశ్వరరావు సూచించారు. సోమవారం నాడు ఆయన డివిజన్ పరిధిలోని ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 663 సిమెంటు రోడ్లు, డ్రైయిన్ల వంటి పనులు రూ.40.64 కోట్ల నిధులతో చేపట్టామన్నారు. ఈ పాటికే 257 పనులు పూర్తయినట్లు తెలిపారు. అత్యధికంగా ఒంగోలు నియోజకవర్గ పరిధిలోని ఒంగోలు మండలంలో 7.2 కోట్లతో 176 పనులు, కొత్తపట్నం మండలంలో రూ.7.93 కోట్లతో 188 పనులు వివిధ దశల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. దర్శి నియోజకవర్గ పరిధిలోని దర్శి మండలంలో రూ.3 కోట్లతో 36, దొనకొండ మండలంలో రూ.3 కోట్లతో 39, కురిచేడులో రూ.3 కోట్లతో 34, ముండ్లమూరు మండలంలో రూ.3 కోట్లతో 37, తాళ్ళూరు మండలంలో రూ.3 కోట్లతో 58 పనులు మొత్తం రూ.11.5 కోట్లతో 204 పనులు జరుగుతున్నాయన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలోని సంతనూతలపాడు మండలంలో రూ 3.6 కోట్లతో 30, నాగులుప్పలపాడు మండలంలో రూ.3.61 కోట్లతో 36, మద్దిపాడు మండలంలో రూ.3.3కోట్లతో 29 మొత్తం రూ.10.51 కోట్లతో 95 పనులు వివిధ దశల్లో చేపట్టినట్లు ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకనుగుణంగా ఈ పనులన్నింటినీ సంక్రాంతిలోగా పూర్తి చేసే రీతిలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఆయా గ్రామల్లో సచివాలయ పరిధిలో పనులు వేగవంతం అయ్యేందుకు ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సహకారం తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.

కోటేశ్వరరావు

రాజీనామా చేసిన కౌన్సిలర్లు

వైసిపి కౌన్సిలర్ల రాజీనామా

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో వైసిపి కౌన్సిలర్లు రాజీనామా బాట పట్టారు. 27వ వార్డు కౌన్సిలర్ క్వొట్టి నగేష్‌కుమార్, 28వ వార్డు కౌన్సిలర్ కరీముల్లిషా, 31వ వార్డు కౌన్సిలర్ షేక్ నాసర్‌వలి సోమవారం రాజీనామా చేసినట్లు ప్రకటించారు. త్వరలో తమ నిర్ణయం ప్రకటిస్తామన్నారు. వీరంతా ఈ నెల 9న టిడిపిలో చేరుతున్నట్లు ఈ పాటికే ప్రచారం జరుగుతోంది.

వైసిపికి కాశయ్య రాజీనామా

9న టిడిపిలో చేరుతున్నట్లు ప్రకటన

ప్రజాశక్తి-మార్కాపురం

టీవీ కాశయ్య

వైసిపి మార్కాపురం పట్టణ బీసీ సెల్ మాజీ అధ్యక్షు డు తుంబేటి వెంకట కాశయ్య వ్యక్తిగత కారణాలతో వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటం చారు. తనపై నమ్మకంతో అల్లూరి పోలేరమ్మ దేవ స్థానం కమిటీలో ధర్మకర్తగా అవకాశం కల్పించిన మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, వైసిపి నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 9వ తేదీన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సమక్షంలో టిడిపిలో చేరనున్నట్లు కాశయ్య వెల్లడించారు.

11న పెన్షనర్ల సమావేశం

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

పెన్షనర్స్ మరియు రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (ఎపిఆర్ పిఎ) ప్రకాశం జిల్లా విస్తృ స్థాయి సర్వసభ్య సమావేశం ఈ నెల 11న జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ రాంబాబు, గుళ్ళాపల్లి శేషయ్య ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నాడు ఒంగోలులోని పివిఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉదయం పది గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యన్ఎ శాస్త్రి, కె.సత్తిరాజులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి సంఘ సభ్యులు, ఇపిఎఫ్ పెన్షనర్లతో పాటు కేంద్ర, రాష్ట్ర పెన్షనర్లు అందరూ హాజరు కావాలని కోరారు.

ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మునీర్

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రజా సంకల్ప వేదిక సమావేశం గుంటూరులోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జాతీయ అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి అధ్యక్షతన జరిగింది. మీడియా విభాగం నుంచి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మార్కాపురానికి చెందిన షేక్ మునీర్‌బాషా నియమితులయ్యారు.

బస్ షెల్టర్ అభివృద్ధికి శ్రీకారం

ప్రజాశక్తి-భట్టిప్రోలు



మరమ్మతులు జరుగుతున్న బస్ షెల్టర్

మండల కేంద్రమైన భట్టిప్రోలులోని అద్దేపల్లి గ్రామంలో ఉన్న ఆర్టీసీ బస్సు షెల్టర్ శిథిలావస్థకు చేరడంతో భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. "శిథిలావస్థకు చేరిన అద్దేపల్లి బస్సు షెల్టర్ " అనే శీర్షికన గత రెండు నెలల క్రితం ప్రజాశక్తిలో ప్రచురితమయింది. దీంతో బిఎఫ్ఎ సభ్యులు స్పందించి ఈ బస్టాండ్ చుట్టూ పెరిగిపోయిన పిచ్చి చెట్లను తొలగించి పగుళ్ళు ఇచ్చిన గోడలకు మరమ్మతులు చేపట్టారు. రంగులు దిద్ది నూతన హంగులతో రూపుదిద్దుతున్నారు. అద్దేపల్లి బస్సు షెల్టర్ ద్వారా తెనాలి, విజయవాడ, రేపల్లె వంటి ప్రాంతాలకు ప్రయాణికులు వెళ్తు ఉంటారు. శిథిలావస్థకు చేరిన సమయంలో ఇక్కడ ప్రయాణికులు ఆరుబయట ఎండలో నిలబడి బస్సులొచ్చేంత వరకు వేచి చూడాల్సి వచ్చేది. ప్రస్తుతం బిఎఫ్ఎ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు పూర్తికానున్నాయని త్వరలో ఈ బస్సు షెల్టర్లు ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు బిఎఫ్ఎ సభ్యులు బొలిశెట్టి శ్రీనివాసరావు, పసుపులేటి శివరామకృష్ణలు తెలిపారు.

ఉపాధి కూలీలకు 300 పనిదినాలు కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు

ప్రజాశక్తి-ముండ్లమూరు

ఉపాధి కూలీలకు 300 పనిదినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం 2025 క్యాలెండర్‌ను తహశీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహశీల్దార్ ఆర్.శ్రీకాంత్, వ్యవసాయాధికారి ఫారుక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు, సిఐటియు రైతు పిఎన్ఎం సంఘాల నాయకులు హనుమంతరావు, కొండలు, సత్యం వెంకటేశ్వర్లు, రాజా రమేష్, రామాంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ శేషగిరి, ఆర్ఐ మూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పనిదినాలు 300 రోజులకు పెంచాలని, వేతనం 600కు పెంచాలని, ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని, భూమి కొనుగోలు ద్వారా భూమి కొని ఇవ్వాలని, కార్మికులకు చట్టం చేయాలని డిమాండ్ చేశారు.

ధరల కట్టడిలో ప్రభుత్వం విఫలం

కాంగ్రెస్ పార్టీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌస్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

డబుల్ ఇంజన్ సర్కార్ పేరుతో కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రోజురోజుకీ పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలను అదుపు చేయడంలో తీవ్రంగా విఫలమయ్యాని ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి బిఆర్ గౌస్ అన్నారు. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే నిత్యావసర ధరలను పెంచబోమని, అవసరమైతే ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి ధరలు తగ్గిస్తామని కూటమి ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెప్పిందన్నారు. నేడు వ్యాపారులంతా కూటమిగా ఏర్పడి ధరలు పెంచుకుంటూ పోతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా చూస్తుందన్నారు. కొత్త సంవత్సరం, సంక్రాంతి పండుగ వేళల్లో నిత్యావసర ధరల పెరుగుదలతో మధ్య, దిగువ తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకు ఇస్తామన్న హామీలు అమలు చేయకపోగా, రోజురోజుకీ ఆకాశాన్ని అంటుతున్నాయని, ధరల పెరుగుదలతో వారు పేదలు బతికే పరిస్థితి లేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం మేలుకొని కనీసం పండుగ వేళలోనైనా నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలను తగ్గించాలని ఆయన కోరారు.

లారీ ఎక్కిన బోట్లు

ప్రజాశక్తి-శింగరాయకొండ

లారీలపై వెళ్తున్న బోట్లు

నిత్యం సముద్రంపై తిరిగే బోట్లు లారీ ఎక్కాయి. లారీపై చక్కర్లు కొడుతూ ప్రయాణంలో సాగిపోతున్నాయి. శింగరాయకొండ జాతీయ రహదారిపై కనుమల్ల- కలికివాయి మధ్యలో ఉన్న రన్‌వే మీద మూడు పెద్ద లారీలు వాటిపైన పెద్దపెద్ద బోట్లు కనిపించాయి. చెన్నై ప్రాంతం నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్నామని లారీ డ్రైవర్లు చెబుతున్నారు. అయితే నిత్యం సముద్రంపైన వేట కోసం రవాణా చేసే ఈ పెద్దపెద్ద బోట్లు లారీలపై ఎక్కి రోడ్డు మీద కనిపించడంతో జనం ఆసక్తిగా చూస్తున్నారు.

విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-టంగుటూరు

బాక్స్ లంగడి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ నుంచి కాకినాడ జిల్లా రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాక్స్ లంగడి పోటీలలో తూర్పునాయుడుపాలెం విద్యార్థులు సత్తా చాటారు. మండలంలోని తూర్పునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎస్.ధనలక్ష్మి (52 కేజీలు), టి.దివ్య (48 కేజీలు) విభాగాలలో ప్రథమ స్థానం సాధించారు. బాక్స్ లంగడి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో చక్కటి ప్రతిభ కనపరిచి బంగారు పతకం సాధించారు. తూర్పు నాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన పాఠశాల విద్యార్థులను, క్రీడలను ప్రోత్సహించి క్రీడా పోటీలకు పంపిన విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్‌వి సుధారాణి, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

మారం వెంకారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న రజకులు

నీటి పైపులు అందజేత

ప్రజాశక్తి - చీమకుర్తి

స్థానిక రజక నీటికుంటకు సాగర్ కాలువ నుంచి నీటి సరఫరా కోసం రూ.25 వేలు విలువైన సిమెంట్ పైపులను మద్దిపాడు ఏఎంసీ మాజీ ఛైర్మన్ మారం వెంకారెడ్డి బహూకరించారు. స్థానిక గరికమిట్ట సమీపంలోని రజక వృత్తిదారుల నీటి కుంటకు నీరు అందక రజక వృత్తిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రజక వృత్తిదారుల కమిటీ సభ్యులు మారం వెంకారెడ్డిని కలిసి సాయం చేయాలని కోరారు. స్పందించిన ఆయన సోమవారం రూ.25 వేలు విలువచేసే సిమెంట్ పైపులను అందించారు. ఈ సందర్భంగా రజక వృత్తిదారులు మారం వెంకారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

చెక్కు అందజేస్తున్న మంత్రి స్వామి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-టంగుటూరు

తూర్పునాయుడుపాలెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వెలగపూడి మంగమ్మకు రూ.16,200 సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంత్రి స్వామి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ వైద్య సహాయం అందించడమే లక్ష్యంగా టిడిపి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొమ్మినేని వెంకటరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలను ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

ఎబిసిలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-తాళ్ళూరు

సంస్కృతి సంప్రదాయాలను కాపాడేందుకు ఎబిసి ఉన్నత పాఠశాల యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి సుధాకర్‌రావు అన్నారు. ఎబిసి హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలలో భాగంగా సోమవారం ముగ్గుల పోటీలను ఆయన ప్రారంభించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పోటీలలో పాల్గొని ముచ్చటగా ముగ్గులు వేశారు. పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, ప్రోత్సాహక బహుమతులను సంక్రాంతి సంబరాల సందర్భంగా అందజేస్తామని ఎబిసి హైస్కూల్ యాజమాన్యం తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ టి శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కె వెంకటేశ్వరరావు, డైరెక్టర్ కాలేషాబాబు పాల్గొన్నారు.

రోజమ్మకు నివాళి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

పత్రా రోజమ్మ (83)

కొనకనిమెట్లకు చెందిన పాత్రికేయులు పత్రా పిచ్చయ్య మాతృమూర్తి పత్రా రోజమ్మ (83) ఇటీవల అనారోగ్యానికి గురై సోమవారం మృతి చెందారు. ఆమెకు ముగ్గురు కుమారులు, కూతురు, మనవళ్లు, మనవరాలు ఉన్నారు. రోజమ్మ మృతి విషయం తెలుసుకున్న మార్కాపురం నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ అందే నాసరయ్య, వైసిపి రాష్ట్ర కార్యదర్శి, వాగుమడుగు మాజీ ఎంపీటీసీ మంచికల చిన్నకోటేశ్వరరావు, పొదిలి ఏపీటీఎఫ్ నాయకులు ఎం కోటేశ్వరరావు, ఏపీ రైతు సంఘం నాయకులు పివి కొండయ్య, పొదిలి ఏరియా సిపిఎం కన్వీనర్ పి బాలనరసయ్య, నాయకులు సిగినం వెంకటేశ్వర్లు, సిద్దయ్య, పాస్టర్లు కోల రవికుమార్, జాన్‌పాల్ ఆమె మృతదేశాన్ని సందర్శించి నివాళులర్పించారు.

డిగ్రీ కాలేజీ విద్యార్థుల ర్యాలీ

లింగ ఆధారిత హింస నిర్మూలనకు ర్యాలీ

ప్రజాశక్తి-దర్శి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా హక్కుల కోసం మహిళా సాధికారత, లింగ ఆధారిత హింస నిర్మూలన కోసం సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వి రమణ మాట్లాడుతూ మహిళల హక్కుల పరిరక్షణ, మహిళలకు సంబంధించిన చట్టాలను పటిష్టంగా అమలు చేయడం, ఈ రక్షణ చట్టాలపై అవగాహన కల్పించడం ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. పని ప్రదేశాల్లో లింగ ఆధారిత వివక్ష, హింస అభివృద్ధికి ఆటంకం అని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు అనువైన స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలని కోరారు. మహిళల రక్షణ చట్టాలు మరింత కఠినం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సాధికారత సెల్ కోఆర్డినేటర్ ప్రవీణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దారు ఆవుల సురేష్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు వీలుంటుందని తహశీల్దార్ ఆవుల సురేష్ అన్నారు. సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మండలంలోని గొట్లగట్టు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ సదస్సులో భూ సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. గొట్లగట్టు గ్రామాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు కావాలని, గ్రామంలో స్మశాన వాటిక స్థలం ఏర్పాటు చేయాలని తహశీల్దార్ ఆవుల సురేష్‌ను గ్రామస్థులు కోరారు. స్పందించిన తహశీల్దార్ సురేష్ గ్రామ చిత్రపటం ద్వారా ప్రభుత్వ భూములను గుర్తించి సర్పంచ్‌కి చూపించి సమస్యను త్వరగతిన పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. గొట్లగట్టు, బుడంకాయలపాడు గ్రామాలకు సంబంధించి 22 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. సదస్సులో 5 అర్జీలు అక్కడికక్కడే పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రాజశేఖర్, గ్రామసర్వే కాంతారావు, గ్రామ రెవెన్యూ అధికారి ఎన్‌ఎన్‌వి దిలీప్ కుమార్, మంద రమేష్, పునుగొటి రాణాప్రతాప్‌రెడ్డి, సర్పంచి సుఖదేవ్, టిడిపి మండల కన్వీనర్ మోరబోయిన బాబురావు, సర్పంచి సుఖదేవ్, మండల కన్వీనర్ మోరబోయిన బాబురావు, మండల మాజీ కన్వీనర్లు కాశిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కనకం నరసింహారావు, నాయకులు పరిటాల సుబ్బయ్య, జవ్వాజి భాషా, పతినాయుడు పాల్గొన్నారు.

రబీ పంటల నమోదు తనిఖీ

ప్రజాశక్తి-తాళ్ళూరు

క్షేత్రస్థాయిలో ఈక్రాప్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్ సంజీవరావు, ప్రసాదరావు

మండలంలో 2024-25 రబిలో సాగు చేసిన పంటలను సూపర్ చెక్ చేయడం ద్వారా విఎఎలు, విఆర్‌ఓలు ఇ-పంటల నమోదు చేసిన పంటల వివరాలు సరిగ్గా ఉన్నాయా లేదా అని తెలుసుకొని సరి చేయడం జరుగుతుందని తహశీల్దార్ కె సంజీవరావు, వ్యవసాయ అధికారి బి ప్రసాదరావు తెలిపారు. తాళ్ళూరు-1 పరిదిలోని రైతులు వేసి పంటలను ఇ-పంట యాప్ నందు నమోదు చేసిన వివరాలు సరిగ్గా ఉన్నాయా లేదా తనిఖీ చేసినట్లు తెలిపారు. నమోదు చేసిన వివరాల్లో ఖాతా నెంబర్, సర్వే నెంబర్, విస్తీర్ణం, పంట రకం, నీటి వసతి, విత్తన తేది, రైతు, కౌలుదారు వివరములు తదితర అంశాలను పరిశీలించి యాప్‌నందు కెవైసీ, డివైజ్ ద్వారా సరి చూసుకొని సంబంధిత వివరాలు చెక్ చేయడం జరుగుతుందన్నారు. పంటల నమోదు పరచిన వివరాలు పారదర్శకంగా ఉండేందుకు 7 అంచెల్లో ఎఓ, తహశీల్దార్, ఎడిఎ, ఆర్‌డిఓ, డిఎఓ, జూనియర్ కలెక్టర్, కలెక్టర్‌లు సూపర్‌చెక్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వై శ్రీనివాసరావు, విఆర్ఓ నాగలక్ష్మీ, విఎఎ నాగరాజు నాక్, విలేజ్ సర్వేయర్ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ'లో సృజనాత్మకత అంశాల ప్రదర్శన

అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతి

ప్రజాశక్తి-దర్శి

దర్శి నగర పంచాయతీ రామాలయంగుడి అంగన్‌వాడి కేంద్రం, శివాలయం సెంటర్‌లో పిల్లలకు ఇసిసిఇ డే సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి కార్యకర్త ఎస్ జ్యోతి మాట్లాడుతూ ప్రతి నెల 5న ఇయర్లీ చైల్డ్ కోర్స్, ఎడ్యుకేషన్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు. పిల్లలలో సృజనాత్మకత వెలికి తీసేందుకే ఇసిసిఇ డే నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం పిల్లలకు పుస్తకాలలో ఉన్న బొమ్మలు చూపిస్తూ సంఖ్యా జ్ఞానం, సృజనాత్మకత అంశాలు పిల్లల చేత ప్రదర్శింప చేశారు. పిల్లలకు పుస్తకాలలో ఉన్నబొమ్మలు, ఆటలు, అంకెలతో కూడిన అభినయగేయాలు చెప్పించటం, మార్కెట్‌కు వెళ్ళి కూరగాయలు కొంటున్నట్లుగా, అమ్ముతున్నట్లుగా చేయించడం, సృజనాత్మకత కోసం తల్లితండ్రులను అంగన్‌వాడి కేంద్రానికి రప్పించి స్థానిక కథలు, ఆట, పాటలు చెప్పించడం వంటివి పిల్లలకు, పిల్లలతో పాటు తల్లిదండ్రులకు చూపించారు. పిల్లల చేత గుర్తించారు. కార్యక్రమంలో కార్యకర్తలు రవణమ్మ, విజయమ్మ, పిల్లల తల్లిదండ్రులు రేవతి, మల్లిక, నారాయణస్వామి, రమేష్, సంధ్యా, సుల్తానా, నవీన్ పాల్గొన్నారు.

తాళ్ళూరు : మండలంలోని వెలుగువారిపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడి కేంద్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, పౌష్టికాహారం, విద్యా వికాసం గురించి ప్రదర్శన ఏర్పాటు చేశారు. చిన్నారులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పోలంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రంలో చిన్నారులను చేర్పించి పిల్లల శారీరక, మానసిక వికాసానికి, జ్ఞానాభివృద్ధికి అంగన్‌వాడి కేంద్రాలను ఉపయోగించుకోవాలని అన్నారు. అంగన్‌వాడి కార్యకర్త ఆర్ సునీత, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం పోలంరెడ్డి సుబ్బారెడ్డి

వెంగయ్యను సన్మానిస్తున్న దృశ్యం

డాక్టరేట్ పొందిన వెంగయ్యకు సన్మానం

ప్రజాశక్తి-సిఎస్ పురం

టిడిపి మండల అధ్యక్షులు బొమ్మనబోయిన వెంగయ్యను సోమవారం పలువురు టిడిపి నాయకులు, టిడిపి పట్టణ అధ్యక్షులు తోట చిన్న ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వెంగయ్య పిహెచ్‌డి పూర్తి చేసి డాక్టరేట్‌కు అర్హత పొందడం పట్ల స్థానిక టిడిపి కార్యాలయంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. డాక్టరేట్ పొందడం పట్ల ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగిశెట్టి చినమాల కొండయ్య, బొబ్బూరి రమేష్, రామకృష్ణంరాజు, పి రవికుమార్, వెంకటాద్రి, జగన్నాథం లక్ష్మి, కె వెంకటకొండయ్య, బండారు వెంకటరామయ్య, ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య, తోట శ్రీరాములు, గల్లా చెన్నయ్య, భూషణం పాల్గొన్నారు.

మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న చైర్మన్ పిచ్చయ్య

పంచాయతీ కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-దర్శి

పంచాయతీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్న వెన్నపూస శ్రీనివాస్‌రెడ్డి (52) సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య ఆ కుటుంబానికి రూ.15వేల ఆర్థిక సాయం చేశారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతునికి పలువురు నివాళులు అర్పించారు. 2వ వార్డు కౌన్సిలర్ విసి రెడ్డి తదితరులు ఉన్నారు.

శ్రీశైలం బస్సును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-దర్శి

గత 5నెలలుగా అద్దంకి డిపోనుండి శ్రీశైలం నడుపుతున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసును గత మూడు రోజులుగా నిలిపి వేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈబస్సు ద్వారా అద్దంకి, ముండ్లమూరు, తాళ్లురు, దర్శి, పొదిలి మండలాల పరిధిలోని ముండ్లమూరు, తాళ్ళూరు, మాధవరం, తూర్పుగంగవరం, నాగంబొట్లపాలెం, బొద్దికూరపాడు, కొత్తపల్లి, రాజంపల్లిలతోపాటు మరో 10 గ్రామాల ప్రయాణీకులు శ్రీశైలం వెళ్ళుతున్నారు. దైవ దర్శనం తోపాటు పర్యాటక సందర్శన, ఇతర అవసరాలకు ఆయా గ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉన్న బస్సు సర్వీసు నిలిపేయడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనివల్ల ప్రయాణీకులు ఇబ్బంది పడుచున్నారు. ఆర్టీసీకి ఆదాయం వస్తున్నప్పటికీ ఎందుకు బస్సును రద్దు చేశారని ప్రశ్నిస్తున్నారు. గ్రామీణ ప్రజలకు దూర ప్రాంత ప్రయాణాలకు సౌలభ్యంగా ఉన్న బస్సు సర్వీసును కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు. శ్రీశైలం ప్రయాణంతోపాటు దగ్గరలోని గ్రామాలను అనుసంధానం చేస్తూ నడిపిన బస్సు ప్రయాణానికి ప్రజలకు అనువుగా ఉన్నట్లు చెబుతున్నారు. ఆయా గ్రామాల ప్రయాణికుల కోరిక మేరకు అద్దంకి డిపో నుండి శ్రీశైలం బస్సును పునరుద్ధరణ చేయాలని కోరుతున్నారు. అద్దంకి నుండి బొద్దికూరపాడుకు ఆర్డినరీ సర్వీస్‌ను సాయంత్రం ట్రిప్ పునరుద్దరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ బస్సు రద్దుతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నట్లు చెబుతున్నారు.

ప్రజాశక్తి

మంగళవారం 7 జనవరి 2025

మత్స్య సంపద, ఆక్వా రంగం ద్వారా

జిల్లా వార్షిక ఆదాయం పెంచాలి : కలెక్టర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

మత్స్య సంపద, ఆక్వా రంగం ద్వారా జిల్లా వార్షిక ఆదాయం 12 శాతం పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. విజన్ బాపట్ల-2047 అమలు ప్రణాళికపై 12 శాఖల అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోస్తా తీర ప్రాంతంలో మత్స్య సంపదకు విస్తారమైన వనరులు ఉన్నట్లు తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకుని మత్స్యకారులు అభివద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మత్స్యకారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా చూడాలన్నారు. ప్రతి మత్స్యకారుడికి, ఆక్వా రైతులకు తప్పనిసరిగా బీమా వర్తింజేయాలన్నారు. నిజాంపట్నం ఓడరేవు విస్తరణ పనులు వేగంగా జరిగేలా పర్యవేక్షించాలన్నారు. చీరాల వాడరేవు నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలన్నారు. ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్ ప్రతిపాదనలు త్వరగా పంపాలన్నారు. 289 ఫిషింగ్ టూల్స్ జిల్లాకు మంజూరు కాగా, 15 మంది మత్స్యకారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలినవి మత్స్యకారులకు అందజే యాలన్నారు. 10,050 మత్స్యకారులకు వేట నిషేధిత సమయంలో పరిహారం అందించడానికి శరవేగంగా సర్వే పూర్తి చేయాలన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి

ప్రకతి వ్యవసాయంపై అధికారులు దష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం 35,380 ఎకరాలలో 32,092 రైతులు ప్రకతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేస్తున్నారన్నారు. వారికి మార్కెట్ సౌకర్యం కల్పించేలా ఆన్‌లైన్‌లో పోర్టల్ అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సాధారణ వ్యవసాయం కంటే ప్రకతి వ్యవసాయం విస్తరణ మరింత పెరగాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు పంటల సాగులో లక్ష్యాలు చేరుకోవాలన్నారు. కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులు జారీచేసి రుణ సదుపాయం కల్పించాలన్నారు. 6,03,300 మెట్రిక్ టన్నుల పాలు ప్రతి ఏటా ఉత్పత్తి జరుగుతుండగా మరింత పెరగడానికి ప్రణాళికలు రూపొందించి లక్ష్యాలు చేరుకోవాలన్నారు. 775 గోకులాల నిర్మాణ లక్ష్యంలో 211 మాత్రమే పూర్తి కావడం ఏమిటని అధికారులను ప్రశ్నిం చారు. పాడిగేదెల విస్తరణకు అధికారులు సహకరించాలన్నారు.

ధాన్యం సేకరణ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగదు చెల్లింపుల్లో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. యంత్రాల పరిశీలనపై అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. సహకార శాఖ ద్వారా నిర్మిస్తున్న గోదాముల్నఉ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే నిర్మించినవి సొసైటీలకు అప్పగించగా, మిగిలినవి అప్పగించేలా చూడాలన్నారు. జన ఔషధ కేంద్రాలు నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. బీచ్‌ల అభివద్ధితో పర్యాటక ప్రాంతాలు మరింత ప్రాచుర్యం పొందుతాయని తెలిపారు. వాడరేవు నుంచి సూర్యలంక వరకూ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మౌలిక వసతుల కల్పనతో పర్యాటక ప్రాంతం మరింతగా పర్యాటక ులను ఆకర్షిస్తుం దన్నారు. పర్యాటకులకు సురక్షితమైన బీచ్‌గా ఉండేలా చర్యలు తీసుకోవాలని, దుస్తులు మార్చుకొనేందుకు , మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం జిల్లాలోని 313 పరిశ్రమలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. నిబంధన మేరకు నడుస్తున్నాయా లేదా అని పరిశీలించాలన్నారు. ప్లాస్టిక్ ఉద్గారాల వినియోగాన్ని తగ్గించడానికి జిల్లా యంత్రాంగం కలిసికట్టుగా పనిచేయాలన్నారు. భవన నిర్మాణ రంగంలోని కార్మికులందరికీ గుర్తింపు కార్డులు జారీచేయాలని కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. పరిశ్రమలు, అసంఘటిత రంగాలలో తనిఖీలు నిర్వహించి కార్మికులకు కనీస వేతనం అమలయ్యేలా చూడాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన చోట కేసులు నమోదు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గహాలలో ఉత్తీర్ణత శాతం మరింత పెరగడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గహాల మరమ్మతులు త్వరగా చేపట్టాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ప్రతి వారంలో వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఆయా వర్గాలకు అందేలా చూడాలన్నారు. ఆర్థికంగా అత్యంత వెనుకబడిన సామాజిక వర్గాలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సిపిఒ శ్రీనివాస్, 12 శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'సెయింట్‌ఆన్స్'లో వర్క్‌షాపు

ప్రజాశక్తి-వేటపాలెం

మాట్లాడుతున్న డానియేల్

సెయింట్ ఆన్స్ కాలేజ్ అఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సైబర్‌సెక్యూరిటీ విభాగం అధికారుల ఆధ్వర్యంలో నెట్‌వర్క్ ఎసెన్సియల్స్ అండ్ సిములేషన్స్‌పై సోమవారం వర్క్‌షాపు నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ కె. జగదీశ్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా విజయవాడ పివిపి సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ రావూరి డానియేల్ ఆధునిక సాంకేతిక రంగంలో నెట్ వర్క్ అత్యంత ప్రాధాన్యత వహిస్తున్నట్లు తెలిపారు. నెట్ వర్క్ వల్ల ప్రపంచం మొత్తం ఒక గ్లోబల్ విలేజ్ మారిపోయిందన్నారు. నెట్‌వర్క్ సంబంధించి రూటర్లు, ఎక్సెస్ పాయింట్స్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ సెక్యూరిటీ విభాగాధిపతి రమేష్ తెలిపారుసైబర్ సెక్యూరిటీ లో నెట్ వర్క్ కమ్యూనికేషన్ యొక్క ప్రాముఖ్యతను ప్రయోగాత్మకంగా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూమి పరిశీలన

ప్రజాశక్తి-వేటపాలెం

వేటపాలెం మండలం దేశాయిపేట ,చల్లారెడ్డిపాలెం గ్రామ సరిహద్దుల మధ్య సొన పోరంబోకు భూమి ఆక్ర మణకు గురైంది. ఆక్రమణదారుడు తన వద్ద సంబంధిత భూమికి సంబంధించిన పత్రాలు ఉన్నాయంటూ రెండు రోజుల క్రితం తెలిపారు. అయితే ఎలాంటి ఆధారాలు చూపలేదు. దీంతో తహశీల్దారు పార్వతి ఆదేశాల మేరకు గ్రామ రెవెన్యూ అధికారులు కష్ణవేణి,రఫీ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రెవిన్యూ రికార్డుల ప్రకారం ఆ భూమి సర్వే నంబర్ 102/2 నాయనపల్లి సోన పోరంబోకు భూమిగా నిర్ధారించారు. అది సొనపోరం బోకు భూమిగా పేర్కొంటూ బోర్డును ఏర్పాటు చేశారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - చీరాల

చీరాల పట్టణం పేరాలలోని శ్రీ భద్రావతి సమేత భావనారుషి దేవస్థానం శత వసంతోత్సవం సందర్భంగా ఈనెల ఈనెల 12 నుంచి 21 వరకూ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ భావనా ఋషి దేవస్థానం నిర్మించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 17న రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించ ునున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు, పద్మశాలి ప్రతినిధులు, దేవస్థానం ప్రధాన కార్యదర్శి జి. వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ జంజనం

జాబ్‌మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ సహకారంతో మార్టూరులోని శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు విశేషస్పందన లభించింది. జిల్లా నైపుణ్య ఆభివద్ధి అధికారి పి. ప్రణయ్ ఆధ్వర్యంలో ఐసిఐసిఐ, ముత్తూట్,టాటా కాపిటల్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంట ర్వ్యూలు నిర్వహించారు. జాబ్ మేళాకు మొత్తం 44 మంది హాజరు కాగా అందులో 21 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు గడ్డం ఆంజనేయులు మాట్లాడుతూ.. నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలు, శిక్షణా తరగతులను నిరుద్యోగ యువత సద్వినియోగంచేసు కోవాలన్నారు. జిల్లా నైపుణ్య ఆభివద్ధి అధికారి పి. ప్రణయ్ మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివద్ధి సంస్థ ద్వారా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్లేస్ మెంట్ అధికారి శ్రీనివాస్, మార్టూరు ఇఎస్‌సి కోఆర్డినేటర్ పచ్చల శ్రీకాంత్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ గోపినాథ్, హర్షిణి కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధికారులు

ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి - నిజాంపట్నం

శ్రీ సత్యసాయి గ్రామ సేవా విభాగంవారి ఆధ్వర్యంలో రేపల్లె శ్రీ సత్య సాయి సేవా సమితి పరిధిలోని నిజాంపట్నం మండలం ,బాపట్ల సమితుల సహకారంతో సోమవారం ఉచిత మెగా పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కూచినపూడి పశువైద్యశాల వైద్యుడు డాక్టర్ హేమప్రియ, పశువైద్య సిబ్బంది పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. పశువైద్య శాఖ విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పున్నయ్య శాస్త్రి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం సత్యసాయి ప్రేమతరులో భాగముగా రైతులకు 100 జామ మొక్కలు శ్రీ బూర్గుల సంగమేశ్వర శాస్త్రి ఆర్థిక సహకారంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా గ్రామసేవా విభాగం ఇన్‌ఛార్జి తుమ్మల శ్రీనివాసరావు , బాపట్ల సమితి సేవాదళ్ సమన్వయకర్త కామేశ్వర రావు ,బాపట్ల సమితి ఆధ్యాత్మిక సమన్వయకర్త సుబ్బారావు , సమితి గ్రామసేవ ఇన్‌ఛార్జి లక్ష్మణ్ ,మహిళా సేవాదళ్ సమన్వయకర్త సుధారాణి ఆంజనేయులు, పాడి రైతులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి ఎఒగా మహేష్‌బాబు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

చెరుకుపల్లి ఎఒగా అవ్వారు మహేష్ బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎఒగా విధులు నిర్వహించిన టి.బాలాజీ గంగాధర్ మెడికల్ లీవ్‌పై వెళ్లాడు. దీంతో మహేష్ బాబు ఎఫ్ఎసి ఎఒగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ సిబ్బందితో ఎఒ మహేష్‌బాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలపరిధిలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమన్వయంతో పనిచేయాలని సిబ్బందికి సూచించారు.

వయోజన విద్య వాచకాలు అందజేత

ప్రజాశక్తి- కారంచేడు

మండల పరిధిలోని వయోజన విద్యా వాలంటరీలకు వయోజన వాచకాలు సోమవారంఅందజేశారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపిడిఒ కె. నేతాజీ, ఎంఇఒ సత్యనారాయణ, వయోజన విద్య కోఆర్డినేటర్ మనోరంజన్, ఎపిఎం మోహన్‌రావు చేతుల మీదుగా వయోజన వాచకాలు అందజేశారు. ఈ సందర్భంగా వయోజన విద్య కోఆర్డినేటర్ మనోరంజన్ మాట్లాడుతూ చదువుతోనే రాష్ట్రం అభివద్ధి చెందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలని సంకల్పం తోనే ప్రభుత్వం వయోజన విద్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-పర్చూరు

అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను పర్చూరు తహశీల్దారు పి. బ్రహ్మయ్య సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు, వంట సామగ్రి, నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు సుధారాణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్, విఆర్ఒలు శ్రీనివాసరావు, గోవిందరెడ్డి, టిడిపి నేతలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరావుపేట కి చెందిన మాక్స్ విజన్ కంటి వైద్యశాల వైద్యులు డాక్టర్ రామలింగారెడ్డి నేతత్వంలో కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా - 2 అధ్యక్షుడు రావుల బాపయ్య మాట్లాడుతూ ప్రతి నెలా 6వ తేదీన మార్టూరులో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటిశస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఎన్‌టిఆర్ వైద్యసేవ,ఇహెచ్ఎస్ కార్డు ద్వారా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్టూరు యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు షేక్ కమాలుద్దీన్, చిట్టిబాబు, లక్ష్మయ్య, కోటేశ్వరరావు, కొయ్యలమూడి హనుమంతరావు, ఊరా మస్తాన్ రావు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

కలెక్టర్ వెంకటమురళి

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి వచ్చి అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. జిల్లాలో ఉద్యోగుల కుటుంబాల సభ్యులు హౌస్ హెూల్డ్ డేటాలో 1,888 మంది నమోదు కాలేదన్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ శాఖ, పోలీస్ శాఖ, ప్రజారోగ్యశాఖలో 1,200 మంది సభ్యులు హౌస్ హెూల్డ్ డేటాలో నమోదు కాలేదన్నారు. వెంటనే సంబంధిత శాఖ అధికారులు ఉద్యోగుల కుటుంబాల సభ్యుల వివరాలను హౌస్‌హెూల్డ్ సర్వేలో డేటాలో నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమం కింద జాతీయ ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేసి.. ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమం కింద ఇప్పటివరకు రూ.46 కోట్ల విలువైన పనులు మాత్రమే జరిగాయని, పనులు వేగవంతం చేసి సంక్రాంతి నాటికి పూర్తి చేయాలన్నారు. బాపట్లకు చెందిన 16 మంది బధిరుల బృందం నెల్లూరులో జరిగిన క్రికెట్ పోటీల్లో విజేతలై కప్ గెలుచుకున్నందుకు వారిని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్,జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి విలియమ్స్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మ, డ్వామా పీడి విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలమిత్రల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్

మాట్లాడుతున్న పశువుల డాక్టర్ వంశీ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పశుసంవర్ధక విభాగంలోని గోపాల మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించి,కనీస వేతనం అమలుచేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యం.రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో యన్. వీరాంజనేయులు అధ్యక్షతన గోపాలమిత్రల జిల్లా విస్తృత సమావేశం జరిగింది. సమావేశంలో రమేష్ మాట్లాడుతూ గ్రామాలలో 20 ఏళ్లుగా పశువులకు వైద్యసేవలందిస్తున్న గోపాల మిత్రలు సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు ఇన్నేళ్లుగా పని చేస్తున్నా నేటికి గోపాల మిత్రలకు ఉద్యోగ భద్రత లేక అభద్రతా భావంతో ఉన్నారని పేర్కొన్నారు .కనీస వేతనాలు అమలుకాకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేక అర్ధాకలితో అలమటిస్తున్నట్లు చెప్పారు.ప్రభుత్వం ఇచ్చే 6500 రూపాయలు సకాలంలో చెల్లించడం లేదనీ, ఇప్పటికీ 6 నెలలుగా బకాయిలు ఉన్నాయన్నారు.పశువైద్యశాలలకు గోపాల మిత్రలను అటాచ్ చేసి వైద్య కిట్ నిలిపివేయడంతో ఉపాధి దెబ్బతినటం తోపాటు సకాలంలో పశువులకు వైద్యం అందక పశుపోషకులు నష్టపోతున్నారన్నారు.గోపాల మిత్రలకు కనీసవేతనంగా 26వేలు ఇవ్వాలని,ప్రతినెలా మొదటి వారంలో వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.డాక్టర్ వంశీ మాట్లాడుతూ పాడి పరిశ్రమను నిలబెట్టడంలో గోపాల మిత్రల కషి మరువలేనిదన్నారు.గోపాల మిత్రల సమస్యలు పరిష్కరించడం ద్వారా మెరుగైన జీవనాన్ని కొనసాగించేలా ప్రభుత్వం తోడ్పడాలన్నారు.అనంతరం గోపాల మిత్ర యూనియన్ ప్రకాశంజిల్లా కమిటి నూతన అధ్యక్ష కార్యదర్శులుగా జి.రాంబాబు, యన్. సాంబశివయ్య, పి.వెంటరెడ్డి కోశాధికారిగా మరో 10 మందితో నూతన జిల్లా కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో పలువురు గోపాలమిత్రలు పాల్గొన్నారు.

బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలి

అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సొమవారం అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల రాతపూర్వక అర్జీలను అడిషనల్ ఎస్పీ స్వయంగా స్వీకరించారు. వారితో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను చట్టపరిధిలో పరిష్కరిస్తామని అర్జీదారులకు భరోసా కల్పించారు. వచ్చిన ఫిర్యాదులపై వెంటనే చట్ట పరిధిలో విచారణ జరిపి, నిర్దిష్ట గడువులోపు చర్యలు తీసుకుని బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై 37 అర్జీలు స్వీకరించడం జరిగింది. కార్యక్రమంలో పి.జి.ఆర్.ఎస్ సెల్ ఎస్.ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

23న వెలిగొండ జలాల సాధన సదస్సు

హాజరుకానున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

మాట్లాడుతున్న జివి.కొండారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

ఈ నెల 23న కనిగిరిలో వెలుగొండ జలాల సాధన భారీ సదస్సు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి. కొండారెడ్డి తెలియజేశారు. సదస్సుకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు హాజరవుతారని పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సిపిఎం కనిగిరి పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయ్యేందుకు రూ.6 వేల కోట్లు అవసరమవుతాయని తెలిపారు. ప్రతి ఏడాది రూ.1500 కోట్లు కేటాయింపులు చేస్తేనే నాలుగు సంవత్సరాలలో ప్రాజెక్టు పూర్తవుతుందని తెలిపారు. మొదటి దశ పూర్తి కావడానికి రూ.2 వేల కోట్లు అవసరమవుతుందన్నారు. రెండో దశ పూర్తయితేనే కనిగిరి ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. పీసీపల్లి, మోపాడును వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో చేర్చాలని కోరారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కావడం వల్ల కనిగిరి ప్రాంతంలో కరువు తొలగి పాడిపంటలు సమృద్ధిగా పండుతాయని, ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి కావడం వల్ల వలసల నివారణ జరుగుతుందని, తాగునీటి సమస్య తీరుతుందని చెప్పారు. కనిగిరి ప్రాంతం అభివద్ధి చెందుతుందని పేర్కొన్నారు. సమావేశంలో సిపిఎం కనిగిరి పట్టణ కార్యదర్శి పిసి.కేశవరావు, నాయకులు షేక్ బషీర, నరేంద్ర, ఏడుకొండలు, శాంత కుమారి, కె.వెంకటమ్మ పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు

సరాసరి వేతనం పెంచేందుకు చర్యలు

పంచాయతీరాజ్ కమిషనర్ వీఆర్.కృష్ణతేజ ఆదేశం

కృష్ణతేజను సత్కరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో పనిచేసే కూలిలకు సరాసరి వేతనం రూ.300 పెంచేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ మైలవరపు ఆదేశించారు. ఒంగోలు సాయి ఐటిపి కన్వెన్షన్ హాలులో సోమవారం ప్రకాశం జిల్లాలోని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న క్షేత్ర సహాయకుల శిక్షణ కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమానికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జోసఫ్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో ఈ ఏడాది సరాసరి వేతనం కేవలం 209 రూపాయలు మాత్రమే ఉందని, రాబోవు మూడు నెలల్లో 300 రూపాయలు పెంచటానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో రాబోయే ఆరు నెలల కాలంలో పనులు చేపట్టాలని, ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఒక నివేదికను ఇస్తున్నామన్నారు. ఇచ్చిన ప్రణాళికలతో నిర్దేశించిన ఉపాధి హామీ పథకంలో పనులు కూలిలతో చేయించాలన్నారు. చేసిన పనులు ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడాలని సూచించారు. ఎంఎన్‌ఆర్ఇజిఎస్ అధికారులు ఆయా పనులపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలన్నారు. సోషల్ ఆడిట్ నిర్వహించి పథకంలో అవకతవకలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని డ్వామా అధికారులను ఆదేశించారు. రానున్న ఆరు నెలల కాలంలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. పల్లె పండుగ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామంలో సరాసరి వేతనం రూ.300 పెంచటానికి ఎలాంటి ప్రణాళికలు ఉన్నాయో తెలియజేయాలన్నారు. కూలీలకు 100 రోజుల పనిదినాలు కల్పించాలని సూచించారు. కొత్తగా వచ్చిన క్షేత్ర సహాయకులకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకం పై పూర్తి అవగాహన కల్పించారు. రాష్ట్ర ఉపాధి హామీ డైరెక్టర్ షణ్ముఖ్ కుమార్, అదనపు కమిషనర్ ఎం.శివ ప్రసాద్, ముఖ్య విజిలెన్స్ అధికారి భవానీ హర్ష, సంయుక్త కమిషనర్ సునీత ప్రసంగించారు. శిక్షణా కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం కమిషనరేట్ ఉన్నతాధికారులు, జిల్లాలో పనిచేస్తున్న ఏపిఒలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, డ్వామా సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలున్న

ఆ వైద్యుడితోనే పింఛన్ల పరిశీలన.!

- వికలాంగ సర్టిఫికెట్ ఇచ్చేందుకు గతంలో రూ.10 వేలు తీసుకున్నట్లు ఆరోపణలు
- ఉన్నతాధికారుల నిర్ణయం పట్ల విమర్శలు

పింఛన్ల పరిశీలనలో దర్శి హాస్పిటల్ వైద్యుడు (సర్కిల్‌లో)

ప్రజాశక్తి-కొండపి

వికలాంగుల పింఛన్లను క్షుణ్ణంగా పరిశీలించి.. అర్హులైన వారికే పింఛన్ అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నిబంధనలకు విరుద్ధంగా, దొంగ సర్టిఫికెట్లతో తీసుకుంటున్న పింఛన్‌ను తొలగిస్తామని స్పష్టం చేసింది. అలాంటి సర్టిఫికెట్లు ఇచ్చిన వైద్యులపై కూడా చర్యలు తీసుకుంటామని చెప్పింది. ఈ మేరకు వికలాంగ పింఛన్ల పరిశీలనను ప్రారంభించింది. అధికారులతో పాటు వైద్యులు కూడా వికలాంగ పింఛన్ దారుల వద్దకు వెళ్లి.. వారి వైకల్యాన్ని, సర్టిఫికెట్లను పరిశీలించి.. వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. వికలాంగులకు ధ్రువీకరణ సర్టిఫికెట్ ఇచ్చేందుకు గతంలో డబ్బులు తీసుకున్నారన్న ఆరోపణలున్న వైద్యులతోనే పరిశీలన చేయించడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఉన్నతాధికారులు తీసుకున్న ఇలాంటి నిర్ణయాల వల్ల మొత్తంగా ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రక్రియ ఎంతవరకు నిష్పక్షపాతంగా జరుగుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

దర్శి ప్రభుత్వ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కె.ఆంజనేయులు గత రెండు సంవత్సరాల నుంచి కొండపి సిహెచ్‌సిలో ప్రతి గురువారం నాడు వచ్చి వికలాంగులను పరీక్షించి.. వికలాంగ శాతం నిర్ధారించి.. ధృవీకరణ పత్రాలను అందించేవారు. ఈ క్రమంలో ఓ వికలాంగుడి వద్ద ధృవీకరణ పత్రానికి రూ.10 వేలు వసూలు చేశారనే ఆరోపణలు ఆయనపై వచ్చాయి. దీనిపై డిసిహెచ్‌ఎస్‌కు ఫిర్యాదు వెళ్లగా.. ఆ బాధ్యతల నుంచి ఆయనను తప్పించి.. చీమకుర్తికి చెందిన వైద్యాధికారికి ఆ బాధ్యతలు అప్పగించారు. అయితే అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఆ దర్శి డాక్టరే కొండపిలో ఎక్కువమందికి వికలాంగ ధృవీకరణపత్రాలు ఇచ్చి ఉన్నారు. ఇక్కడ వికలాంగ సర్టిఫికెట్ల పరిశీలనకు మళ్లీ ఆ వైద్యుడినే నియమించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆయనతో వికలాంగ పింఛన్ల పరిశీలన చేయిస్తే అక్రమ పింఛన్లు తేలే పనేనా.? అని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ల విచారణ నేపథ్యంలో అధికార పార్టీ నేతల నుంచి కూడా అధికారులపై ఒత్తిళ్లు వస్తున్నాయని సమాచారం.